క్లుప్తంగా

10 నుంచి 'మధ్యాహ్న' కార్మికుల టోకెన్ సమ్మె



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

దహెగాం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10, 11, 12 తేదీల్లో టోకెన్ సమ్మె చేపట్టనున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికులు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సమ్మె నోటీసును కంప్యూటర్ ఆపరేటర్ రాజేశ్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ 10, 11 తేదీల్లో అన్ని మండలాల్లోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సమ్మె, 12న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద టోకెన్ సమ్మె ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. మధ్యాహ్నభోజన కార్మికులు శ్రీలత, లక్ష్మి, వెంకటమ్మ, శారద పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు



రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జూర్: రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్ అన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు మండలంలోని లంబాడిగూడ పంచాయతీలో సోమవారం రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. మొరం వేయించి చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి లేక పొలాలకు వెళ్లేందుకు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇటీవల రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. నాయకులు భుక్య సంతోష్ నాయక్, లావుడే వసంత్, పెంటయ్య, నారాయణ, సవవత్ సాయి ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ప్రైవేటు సెక్యూరిటీగా పని చేస్తూ కోవిడ్‌తో మృతి చెందిన సామల రామ్మూర్తి కుటుంబానికి సోమవారం బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ రూ.15లక్షల ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేశారు. ఎస్‌వోటూ జీఎం నరేందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్, డీజీఎం రామారావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి 'మోడల్' విద్యార్థిని ఎంపిక



అదీబా తెహ్రీమ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ నుంచి అదీబా తెహ్రీమ్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ సోమవారం తెలిపారు. అదీబా తెహ్రీమ్ 7 నుంచి 10వ తరగతి వరకు మోడల్ స్కూల్‌లో చదివి పదో తరగతి 9.8 జీపీఏతో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



కార్మికులను నూతన వస్త్రాలు అందిస్తున్న దేవార వినోద్

రెబ్బెన: ఇందిరానగర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను దేవార వినోద్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దేవార వినోద్ సోమవారం సన్మానించారు. నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులతోనే గ్రామాలు నిత్యం పరిశుభ్రంగా ఉంటున్నాయని అన్నారు.



ఆసిఫాబాద్: గురుచరిత్ర పుస్తక పూజలో భక్తులు



కౌటాల: తుమ్మిడిహెట్టిలో పల్లకి ఊరేగింపు

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

ఆసిఫాబాద్/చింతలమానెపల్లి/దహెగాం/బెజ్జూర్/సిర్పూర్(టి)/కౌటాల: జిల్లావ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. పలుచోట్ల సాయినాథుడి ఉత్సవ విగ్రహాలతో పల్లకిసేవ నిర్వహించారు. మహారాష్ట్రలోని చప్రాడలోని శ్రీ కార్తీక మహారాజ్ ఆలయంలో సిర్పూర్(టి) బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు పూజలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి ఉన్నారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.



సిర్పూర్(టి): పూజలు చేస్తున్న బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు



కౌటాల: ఆలయంలో పూజలు చేస్తూ..



ఖర్జెల్లి ఓంకార ఆశ్రమంలో..



దహెగాం: బీబ్రాలో నగర సంకీర్తనలో భక్తులు



బెజ్జూర్: ఆలయంలో భక్తుల పూజలు



ఆసిఫాబాద్: జ్యోతిప్రజ్వలన చేస్తున్న హెచ్‌ఎం

నీటి కోసం తిప్పలు



గుండాలలో చేతిపంపు వద్ద ఆదివాసీలు

- గుండాలలో అందని భగీరథ నీరు
- ఇక్కట్లు ఎదుర్కొంటున్న ఆదివాసీలు
- చేతిపంపులే దిక్కు

తిర్యాణి: మండలంలోని గుండాల గ్రామంలో నీటి కోసం ఆదివాసీలు తిప్పలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరందకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నీటి కోసం చేతిపంపులే వారికి దిక్కయ్యాయి. గుండాల పంచాయతీ పరిధిలోని మొత్తం ఏడు గూడెలు ఉండగా, జనాభా వెయ్యి వరకు ఉంటుంది. ఆరు గూడెల్లో 6 చేతి పంపులుండగా రెండు చెడిపోయాయి. ఉన్న చేతిపంపుల్లో భూగర్భ జలాలు అంతంత మాత్రంగానే ఉండటంతో గంటల తరబడి కొడితే కాని బిందెడు నీళ్లు రాని పరిస్థితి. దీంతో సమీప వ్యవసాయ బావుల నుంచి ఎడ్లబండ్లు కట్టుకుని నీళ్లు తెచ్చుకుంటున్నామని ఆదివాసీలు పేర్కొంటున్నారు. గుడివాడ, చిక్లీగూడ, అర్లుగూడ గ్రామాలకు ప్రతి ఏడాది ఇదే పరిస్థితి నెలకొంటుంది.

నీళ్లస్తలేవు

మా గూడెంలో రెండు చేతి పంపులు ఉన్నా గంటల తరబడి కొడితే రెండు బిందెలు నిండుతాలేవు. ఎడ్లబండ్లు కట్టుకుని సమీపాన ఉన్న వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. భగీరథ నీరందించాలి.

– శంకర్, గుండాల

నేటి నుంచి నీటి సరఫరా

సిర్పూర్(యూ) మండలంలో నీటి సంపు వద్ద విద్యుత్ సరఫరా సరిగా లేదు. కొన్నిరోజులుగా గుండాల గ్రామానికి నీళ్లు రావడం లేదు. మంగళవారం నుంచి నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపడుతాం.

– కృష్ణ తేజ, మిషన్ భగీరథ ఏఈ

కంది విత్తనాలు పంపిణీ



కౌటాల: విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ విశ్వనాథ్, అధికారులు

కౌటాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ విశ్వనాథ్ సోమవారం రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు పప్పు దినుసులను సాగు చేయాలని రైతులకు వందశాతం సబ్సిడీ పై ప్రభుత్వం విత్తనాలు అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుండాయిపేట్, ముత్తంపేట్ గ్రామాల్లో రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఏవో రాజేశ్, ఏఈవోలు అంజన్న, ఘనశ్యాం, రవి, దుర్గాభవాని, శ్రీలత, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్, బాపు, రాంచందర్ పాల్గొన్నారు.

బెజ్జూర్: కంది విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత కోరారు. మండలంలోని సోమిని రైతు వేదికలో సోమవారం రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఏఈవో శ్రీధర్, సర్పంచ్ ఎలాది శారద, ఉప సర్పంచ్ దుర్గం శంకర్, రైతులు పాల్గొన్నారు.

సలుగుపెల్లిలో..

సలుగుపెల్లి పంచాయతీ ఉట్ సారంగపల్లి రైతు వేదికలో పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగా ఓం ప్రకాశ్ రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ద్వారా రైతులకు వంద శాతం సబ్సిడీపై కంది విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు.



బెజ్జూర్: రైతులకు విత్తనాలు అందిస్తున్న జెడ్పీటీసీ

పీఏసీఎస్ మాజీ చైర్మన్ డోకె వెంకన్న, అందుగులగూడ సర్పంచ్ కుమురం హన్మంత్, ఏఈవో రవితేజ, బీఆర్ఎస్ నాయకులు ఇంజిరి రాజారామ్, చాపిల సత్యన్న, ఏనుక శ్రీహరి, తెలి రాజేశం, రైతులు రమేశ్ పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య కోరారు. మండలంలోని బాలాజీఅనుకోడ రైతు వేదికలో సోమవారం రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో రామక్రిష్ణ మాట్లాడుతూ సిర్పూర్ పేపర్‌మిల్ ఆధ్వర్యంలో నీలగిరి, సుబాబుల్ మొక్కలు అందిస్తున్నారని తెలిపారు. కోఆప్షన్ సభ్యుడు నాజిం హుస్సేన్, ఏఈవోలు విజయ్, శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకన్న, ఎంపీటీసీ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు పట్టాల పంపిణీ



రైతులకు పోడు పట్టాలు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

రెబ్బెన: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో 729 మంది రైతులకు సోమవారం పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పోడు భూమి సాగు చేసుకుంటున్న గిరిజన రైతుల కలను ప్రభుత్వం సాకారం చేస్తూ పట్టాలు అందిస్తోందన్నారు. పోడు భూములకు రైతుబంధు, రైతుబీమా పథకాలు వర్తిస్తాయని అన్నారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేష్‌గౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం..

గిరిజన రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోడు పట్టాలు అందించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రైతు వేదిక వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పోడు పట్టాలు అందించడంతోపాటు రైతుబంధు, రైతుబీమా పథకాలను వర్తింపజేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు.

తిర్యాణి: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 370 మందికి పోడు పట్టాలు అందజేశారు. ఎంపీడీవో మహేందర్‌సింగ్, రైతులు ఉన్నారు. కాగా, పోడు పట్టాల పంపిణీలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు చేతివాటం చూపినట్లుగా ఆరోపణలున్నాయి. గోపెర గ్రామానికి చెందిన మడావి దేవురావు, పోల్లుకు సంబంధించి పట్టాల పంపిణీకి రూ 2.వేలు ఇవ్వాలని సదరు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేసినట్లుగా ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీడీవో సత్యనారయణ సింగ్‌ను వివరణ కోరగా క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతామని, వాస్తవమని తేలితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



పెంచికల్‌పేటలో పాల్గొన్న మహిళలు

గోరింటాకు వేడుకలు



కాగజ్‌నగర్‌లో..

పెంచికల్‌పేట్: ఆషాఢమాసం సందర్భంగా కోదండరామాలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గజ్జెల జయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం గోరింటాకు వేడుకలు జరుపుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సముద్రాల సరిత, ఆర్యవైశ్య సంఘం మహిళలు రాచకొండ సుమిత, సారిక, పడమటింటి సునీత, రాచకొండ రేణుక, ఘణపురం వాని, పుల్లూరి వనిత పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ ఎల్‌బీ మార్కెట్‌లో గల కట్టమైసమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి శాకాంబరి అలంకరణ, ఆషాఢమాస గోరింటాకు వేడుకలను నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు దాసరి వెంకటేశ్, యువ కిరణాల అధ్యక్షుడు తన్నీరు కిరణ్ కుమార్, చేనేత విభాగం అధ్యక్షురాలు మచ్చ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

9న బోనాల జాతర

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో గల మహంకాళి ఆలయంలో ఈనెల 9న బోనాల ఉత్సవంతోపాటు జాతర నిర్వహించనున్నారు. సోమవారం బోనాల ఉత్సవ నిర్వహణపై ఆలయ కమిటీ పదాధికారుల సమావేశం నిర్వహించారు. బోనాల కమిటీ అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బోనాల జాతర సందర్భంగా పట్టణంలోని లారీ చౌరస్తా నుంచి మహంకాళి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పిల్లర్లు దాటని పక్కా గృహం



కెరమెరి: ఆదిమ గిరిజనులకు గృహాలు నిర్మించి ఇవ్వాలన్న సంకల్పంతో మండలంలోని బాబేఝరి కొలాంగూడలో ఐటీడీఏ అధికారులు ఆరేళ్ల క్రితం ప్రారంభించిన పక్కా ఇళ్ల నిర్మాణం పనులు ఇప్పటికీ పూర్తవడం లేదు. నమూనాగా గతంలో ప్రారంభించిన ఇంటి నిర్మాణం అధికారుల నిర్లక్ష్యం కారణంగా పిల్లర్ల దశ దాటడం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణం పూర్తికావడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం : స్పై

కాగజ్‌నగర్

వెంకటరమణ : ఆదిపురుష్

కూరగాయల ధరలు



కూరగాయలు	కిలో (రూ.లో)
టమాటా	160
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	100
కాకరకాయ	80
బెండకాయ	80
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	120
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడుకాయ	100

– ఆసిఫాబాద్‌అర్బన్

మృతుడి కుటుంబానికి పరామర్శ



కుటుంబీకులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకుడు

సిర్పూర్(టి)/కౌటాల: కౌటాల మండలం వైగాం గ్రామ సమీపంలో కరెంట్ స్తంభాలను తీసుకువెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడడంతో బెజ్జూర్ మండలం ముంజంపల్లికి చెందిన బుర్రి వసంత్, అనిల్ (సోదరులు) మృతి చెందారు. మృతదేహాలను సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సిర్పూర్(టి) నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అక్కడికి చేరుకుని సోమవారం మృతదేహాలను పరిశీలించి కుటుంబీకులను పరామర్శించారు. వారికి ఆర్థికసాయం అందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ములే శంకర్, నాయకులు మహేష్ యాదవ్, దుర్గం ప్రశాంత్, కిర్మరె శ్యాంరావ్, చన్కపురి శంకర్, నులిగొండ రాజశేఖర్, బనార్కర్ సాయి, దంద్రె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఉమ్మడి ఆదిలాబాద్ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఆదివాసీ పెద్దలు పారిపెల్లి పోశం, బానయ్య, ఎడ్ల భీమయ్య, కుర్మ రాజు, నాయకులు డుబ్బుల శంకర్, డోకె వెంకన్న, సంతోష్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆదివాసీ నాయకులు వారిని ఓదార్చి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్తరప్రదేశ్‌లో గంగాపూర్ వాసి మృతి



దేవాజీ (ఫైల్)

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన దుర్గం దేవాజీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. జూన్ 30న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బల్లియ జిల్లా బైరియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేట్రాక్ వద్ద మృతదేహం లభించింది. జేబులో ఉన్న సిమ్‌కార్డు ఆధారంగా పోలీసులు గంగాపూర్‌లోని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అతని సోదరులు శేఖర్, తిరుపతి అక్కడికి వెళ్లి మృతుడు దేవాజీగా గుర్తించారు. మృతుడి తలపై బలమైన గాయాలు ఉన్నట్లు తెలిపారు. ఆదివారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.